క్లుప్తంగా

నవధాన్యాల సాగుతో జీవ వైవిధ్యం



నవధాన్యాల కిట్‌లను అందజేస్తున్న ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్

డెంకాడ: నవధాన్యాల సాగుతో జీవ వైవిధ్యం, కార్బన్ శాతం నేలలో పెరిగి భూసారం పెరుగుతుందని ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్ అన్నారు. మండలంలోని అమకాం ఆర్‌బీకేలో రైతులకు నవధాన్యాల కిట్‌లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు వలన వానపాములు వృద్ధి చెందుతాయని తెలిపారు. నేల సారవంతంగా మారడంతో పంట దిగుబడి బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన ధనలక్ష్మి, సుజాత, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

భోగాపురం: ఓటర్ జాబితాలను ఆధార్‌తో అనుసంధానం చేయించాలని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు బీఎల్‌ఓలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలో ఉన్న బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంటింటికి తిరిగి కొత్త ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు వెంటనే సరిచేయాలని సూచించారు. సమావేశంలో డీటీ ఎస్.శ్రీనివాసరావు, బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూత నివ్వడంలో సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మంగళవారం 100 మంది పేదలకు బియ్యం, గోధుమనూక, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల పేదలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నామని చెప్పారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టగలుగుతున్నామని తెలిపారు. వృద్ధాప్యంలో పేదలను అప్యాయంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తులసీరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

భోగాపురం: ఉద్యోగిగా అంకితభావంతో పని చేసినప్పుడు అందరి మన్నలను పొందడమే కాకుండా మంచి గుర్తింపు లభిస్తుందని వైద్యాధికారి టి.తిరుపతిస్వామి అన్నారు. పోలిపల్లి పీహెచ్‌సీలో పనిచేసి బదిలీపై వేరే చోటకు వెళ్లిన సీనియర్ అసిస్టెంట్ కొమ్మూరు దుర్గారావు, హెల్త్ విజిటర్ సూర్యకుమారి, స్టాఫ్‌నర్స్ పద్మావతిలకు మంగళవారం పోలిపల్లి ఆరోగ్య కేంద్రం ఆవరణలో సత్కారం జరిగింది. బదిలీపై వెళ్లిన ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు కుమారి సంతోష్, వివేక్, ఎంపీహెచ్ఈఓ ఒ.రమణ, సూపర్‌వైజర్లు సుధాకర్, లక్ష్మణరావు, సీహెచ్‌వో జయకుమారి, సుజాత, దుర్గా మహాలక్ష్మి, పద్మావతి, ప్రశాంతి, రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులను విద్యకు దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం. హర్ష, జె.రవికుమార్ డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఎత్తు బ్రిడ్జి వరకు మంగళవారం ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సౌమ్య, రాజు, సమీర, వెంకటరమణ, గుణ, మధు, తదితరులు పాల్గొన్నారు.

17న కలెక్టరేట్ వద్ద రజకుల ధర్నా

విజయనగరం పూల్‌బాగ్: దీర్ఘకాలికంగా రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద జిల్లా రజక సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సత్యారావు, కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. స్థానిక బాలాజీ జంక్షన్‌లోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మంగళవారం మాట్లాడారు.

పవన్ వ్యాఖ్యలపై ఎగసిన నిరసన

- దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దగ్ధం
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్



వలంటీర్లతో కలిసి పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తదితరులు

నెల్లిమర్ల రూరల్: వలంటీర్ల వ్యవస్థపై పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండలానికి చెందిన వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కొండవెలగాడలో స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్దకు వలంటీర్లు అధిక సంఖ్యలో చేరుకొని పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి మరీ దగ్ధం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం గ్రామాల్లో ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న మాపై అంత అక్కసు ఎందుకంటూ వారంతా ప్రశ్నించారు. తక్షణమే క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. వలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ రెండు చోట్లా పోటీ చేసి చిత్తుచిత్తుగా ఓడిపోవడంతో మతి పూర్తిగా భ్రమించిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టును చదువుతూ ప్రజలను ఎంత కాలం మోసం చేస్తావని ప్రశ్నించారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, ఆధారాలతో సహా నిరూపించి నిబద్ధత చాటుకోవాలని హితవు పలికారు. 2024 తరువాత జనసేన, టీడీపీ కనుమరగవ్వడం ఖాయమని చెప్పారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

పూసపాటిరేగ: వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రెల్లివలస గ్రామంలో వలంటీర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఎంపీపీ మహంతి కల్యాణి మద్దతుగా పాల్గొన్నారు. పవన్‌కల్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేశారు. వలంటీర్ల సేవలు జనసేన అధినేతకు కనిపించడం లేదా... అని నిలదీశారు. వెంటనే ఆ వ్యాఖ్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, టెలికం డైరెక్టర్ మహంతి కృష్ణమోహన్, వైస్ సర్పంచ్ గొర్లె వెంకటరమణతో పాటు పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

సేవలు కనిపించలేదా...



పవన్ కళ్యాణ్ వలంటీర్లపై అణుచిత వ్యాఖ్యలు చేయడాన్ని టీవీలో చూసి బాధపడ్డాం. వృద్ధ దంపతులుగా ఉన్న మాకు గత ప్రభుత్వంలో ఏ మంచీ జరగలేదు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ నాలుగేళ్లలో రూ.6లక్షలకు పైగా లబ్ధి పొందాం. సొంతిళ్లు లేకపోవడంతో వలంటీర్‌కు చెప్పిన వెంటనే ఇళ్ల స్థలం కూడా మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాం. ఏ అవసరమున్నా వలంటీర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో వచ్చి సమస్యను పరిష్కరిస్తున్నాడు. అటువంటి వలంటీర్లపై ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదు. – కెల్ల అప్పలాచారి దంపతులు, కొండవెలగాడ గ్రామం

పవన్ వ్యాఖ్యలు సరికాదు



వలంటీర్ల గురించి ఎక్కడో ఉండి విమర్శించడం సరికాదు. రైస్ కార్డులో పొరపాటున ప్రభుత్వ ఉద్యోగిగా పడడంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాం. మా వలంటీర్ నరేష్‌కు చెబితే కష్టమైనప్పటికీ చివరికి సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం అన్ని పథకాలు మాకు వర్తిస్తున్నాయి. గ్రామాల్లో పర్యటించి వలంటీర్ల సేవలను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకుంటే మంచిది. – వలిరెడ్డి గోవింద, రామతీర్థం గ్రామం

వలంటీరు సేవలతోనే...



నాకు పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాను. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామంలో వలంటీర్లను నియమించారు. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీ ఉదయం వలంటీర్ బాలి లత ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. అటువంటి వారి సేవలను కించపరచడం సరికాదు. – జాడ కిష్టమ్మ, కె.కొల్లాం గ్రామం



పూసపాటిరేగ: పవన్‌కల్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అవినీతికి తావు లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబుతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారుల సమక్షంలో నేరుగా లబ్ధిదారులతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూర్చిందో గణంకాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతి రహిత పరిపాలనను అందిస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు.

గ్రామాల్లో ధైర్యంగా తిరుగుతున్నాం : ఎమ్మెల్సీ పెనుమత్స

అభివృద్ధి, సంక్షేమంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూసుకుపోతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చడంతో గ్రామాల్లో ప్రజల వద్ద ధైర్యంగా తిరుగుతున్నామని అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా జగనన్న ఉన్నారనే భరోసా ప్రజల్లో కలిగిందన్నారు. ఎటువంటి వివక్ష లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని చెప్పారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తహసీల్దార్ రమణరాజు, ఎంపీడీఓ గిరిబాల పాల్గొన్నారు.

పాడి రైతుకు ఆధారం పచ్చిమేత



పశుగ్రాసం, పచ్చిమేతపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో

భోగాపురం: పాడి రైతుకు ఆధారం పచ్చిమేతనేని పశువైద్య సహాయ సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో అన్నారు. పశుగ్రాస వారోత్సవం కార్యక్రమంలో మంగళవారం మండలంలోని చెరువుకొమ్ముగొల్లపేట గ్రామంలో పశుగ్రాసం పచ్చిమేతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసాభివృద్ధికి పశుపోషకులు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పాడి పరిశ్రమల స్థాపనలో 50 శాతంకు పైగా ఖర్చు దాణాకే సరిపోతుందని, అందువల్ల పాడి రైతులు మొక్కజొన్న, వైరైటిస్ మరియు సూపర్ నేపియర్, శ్రేణి, బహువార్షిక పశుగ్రాసాలను సాగు చేసుకోవాలని సూచించారు. ఒక లీటర్ ఆవు పాలకు అయ్యే ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలంటే పశుగ్రాస సాగు తప్పనిసరి చెప్పారు. కార్యక్రమంలో పాడిరైతులు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

చల్లపేట ఆస్పత్రిని సందర్శించిన డిప్యూటీ సీఎం



ఆస్పత్రి కొత్త భవనం వద్ద డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: మండలంలోని చల్లపేట ఆస్పత్రిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం సందర్శించారు. అనంతరం అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు. అలాగే సక్రమంగా సేవలు అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆస్పత్రి ఆవరణలో దాదాపు రూ.1.73 కోట్ల వ్యయంతో పూర్తి చేసుకున్న నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఈ నెలాఖరు నాటికి ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు.

సారికలో ప్రపంచ జనాభా దినోత్సవం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక గ్రామంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి మోపాడ జగదీష్ మాట్లాడుతూ అధిక జనాభాతో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా ఆహార కొరత, తాగునీటి కొరత, ఆరోగ్య సమస్యలు తలెత్తి ఆర్థిక అభివృద్ధి మందగిస్తుందన్నారు. జనాభా నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిస్తూ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాకోడు పీహెచ్‌సీ సీహెచ్‌వో మాణిక్యం, ఎంపీహెచ్ఈవో సన్యాసిరావు, హెచ్‌వీ జయ, ఆరోగ్య పరిశీలకులు శ్రీను, చిన్నారావు, ఆరోగ్య సహాయకులు కృష్ణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో బహుళ ప్రయోజనాలు

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలతో పాటు పలు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు తదితరులు



డెంకాడ: చొల్లంగిపేటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: రెల్లివలస గ్రామంలో లబ్ధిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి తదితరులు



విజయనగరం రూరల్: ద్వారపూడిలో దరఖాస్తుదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం: దరఖాస్తు దారులకు ధృవీకరణ ప్రతాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



నెల్లిమర్ల రూరల్: జోగిరాజుపేటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి తదితరులు

రూ.32లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం: నగరంలోని 6వ డివిజన్‌లో రూ.32 లక్షలతో నిర్మించనున్న రహదారి పనులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మంగళవారం ప్రారంభించారు. శంకుస్థాపన మాస మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 6వ డివిజన్‌లోని ప్రశాంతి నగర్, సీఆర్‌కాలనీ, జమ్ము ప్రాంతాలలో మూడు రహదారులకు శంకుస్థాపనలు చేశారు. జమ్ము ప్రాంతంలో ఎన్నో ఏళ్లనాటి కలగా ఉండే గ్రావెల్ రహదారి నిర్మాణానికి కూడా మార్గం సుగమయింది. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంతంలోనే కాకుండా శివారు ప్రాంతాలలో సైతం రహదారి సౌకర్యాలను మెరుగుపరిచి ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చూపుతున్న శ్రద్ధ అభినందనీయం అన్నారు. ఏయంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృతంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు

విజయనగరం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని, అభివృద్ధి అంటే ఇలా ఉండాలని ప్రత్యక్షంగా చేసి చూపిస్తున్నామని ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శ్రీ భార్గవి అన్నారు. మంగళవారం నగరంలోని 10వ డివిజన్ పరిధి బొందుల గూడెం పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్‌లు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా స్థానికులు తీసుకొచ్చిన సమస్యలకు వెనువెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. కాలువలు, విద్యుత్ సంబంధిత సమస్యలను పలువురు తీసుకొచ్చారు. స్థానికంగా పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డివిజన్ నాయకులు మహేష్, అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై తస్మాత్...



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. స్థానిక కెఎల్.పురంలో ప్రజలకు సైబర్ మోసాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏదైనా పనిమీద ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సమాచారాన్ని ముందుగా పోలీసుస్టేషన్‌కు అందిస్తే ఆ ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో నేరగాళ్ల అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనుమానాస్పద వ్యక్తులు మీ ప్రాంతాల్లో సంచరించేటప్పుడు డయల్ 100కి లేదా పోలీసుస్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, మెసేజీలు, కాల్స్, ఈ మెయిల్స్‌కి స్పందించవద్దని ప్రజలను కోరారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా నిర్వహించే చిట్టీలను కట్టవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అశోక్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణలు చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్



అవనాపు విక్రమ్

విజయనగరం: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఏలూరు బహిరంగ సభలో వలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌కు వలంటీర్ వ్యవస్థ గురించి ఏమైనా తెలుసా అని ప్రశ్నించారు? ఆంధ్రప్రదేశ్‌లో 2 లక్షల 25 వేల కోట్ల నిధులను ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన ఘనత వలంటీర్‌లకే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తమ ప్రాణాలకు తెగించి సేవలు అందించిన గొప్ప సేవకులని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో చనిపోయిన సొంత వారికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేయకపోతే ఇదే వలంటీర్లు వారికి దహన సంస్కారాలు చేసిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సాక్షాత్తు పార్లమెంట్‌లో కేంద్ర వైద్య శాఖ మంత్రి ఏపీ వలంటీర్ వ్యవస్థ అందించిన సేవలను చాలా గొప్పవని ప్రశంసించారన్న విషయాన్ని గుర్తెరగాలని విక్రమ్ పేర్కొన్నారు. దేశంలోనే వలంటీర్లు ఆదర్శంగా నిలిచారంటూ విక్రమ్ వాలంటీర్లందరికి వందనాలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com